సాక్షి కామారెడ్డి

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



అభ్యర్థులను గెలిపించాలి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యకర్తలను కోరారు.

- IIలో ▸



పదికాలాలు నిలవాలి..

హైకోర్టు జడ్జీలు శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ శనివారం బాన్సువాడ, ఎల్లారెడ్డిలలో కోర్టు భవనాలకు శంకుస్థాపన చేశారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /15.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం'



బాన్సువాడ రూరల్: ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని డీఈవో రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన బోర్లం జెడ్పీహైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కోడ్ హోప్ గ్లోబల్ అనే సంస్థకు చెందిన ఎన్‌ఆర్‌ఐ విద్యార్థినులు మీనాక్షి అరసద, ఆన్య బులుసు, శాంభవి బీహారీలు పాఠశాలకు 10 కంప్యూటర్లు, వెబ్ కెమెరాలను విరాళంగా అందించారన్నారు. సుమారు రూ.4 లక్షల విలువ చేసే కంప్యూటర్లను అందించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు'



నిజాంసాగర్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓ ఫాంహౌస్‌లో జరిగిన సమావేశంలో తాను పాల్గొన్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఆ ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు. శనివారం ఆయన ఢిల్లీలోని పార్లమెంట్ భవనం వద్దనుంచి మీడియాతో ఫోన్ ద్వారా మాట్లాడారు. తాను మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నానని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితోపాటు ఐఏఎస్ అధికారులు, కాంగ్రెస్ నేతలను కలిశానని పేర్కొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నానన్నారు. తనపై అసత్య ప్రచారం చేస్తున్నవారిపై పరువునష్టం దావా వేస్తానన్నారు.

సదరం క్యాంపు తేదీలు ఖరారు

కామారెడ్డి టౌన్: సదరం క్యాంపు తేదీలను ఖరారు చేసినట్లు డీఆర్‌డీఏ సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అంధులు, మూగ, చెవిటి, మానసిక దివ్యాంగులు ఈనెల 5, 12, 19 తేదీలలో జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో నిర్వహించే సదరం క్యాంపులకు హాజరుకావాలని పేర్కొన్నారు. ముందుగా మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి రావాలని సూచించారు.


ఎన్‌డీసీసీబీకి పూర్వవైభవం తీసుకురావాలి



సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)కు పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు పాలకవర్గంతోపాటు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని, బ్యాంకును రాష్ట్రంలోనే ప్రథమ స్థా నంలో నిలపాలని సంస్థ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సూచించారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి నెలల్లో బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు రూ.200 కోట్లకు చేరిన సందర్భంగా కుంట రమేష్‌రెడ్డి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుంట రమేష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా బ్యాంకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని చేరుకోవడానికి కృషి చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాన్ పర్మార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ)ను 14 శాతం నుంచి 10 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ఎన్‌పీఏను మరింత గణనీయంగా తగ్గించాలని సూచించారు. తద్వారా బ్యాంకు యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు అర్హత సాధిస్తామన్నారు. ఆయా శాఖల మేనేజర్లతో వ్యక్తిగతంగా సమీక్షించి, శాఖల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీఈవో నాగభూషణం వందే, ఉన్నతాధికారులు, ఉమ్మడి జిల్లాలోని 63 శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 12 లక్షలకు పెంచడంతో వేతన జీవులు ఊరట చెందుతున్నారు. జిల్లాకేంద్రాన్ని స్మార్ట్ సిటీగా మార్చే ప్రతిపాదనలు లేకపోవడం, రైల్వే ప్రాజెక్టుల ఊసెత్తకపోవడంతో బడ్జెట్‌పై ప్రతిపక్షాలు పెదవి విరుస్తున్నాయి.

- ఆదాయపు పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంపు
- జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం
- కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత
- రైల్వే ప్రాజెక్టుల ప్రస్తావన లేక నిరాశ



వేతన జీవికి ఊరట!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో వేతన జీవులకు ఊరట కలిగించేలా కొత్త పన్ను విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు. గతంలో రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండేది. దీనిని రూ. 12 లక్షలకు పెంచారు. రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.12.75 లక్షల వరకు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదన్న మాట. దీంతో ప్రతినెలా రూ. లక్ష వరకు వేతనం పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఫార్మా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు పలువురు వ్యాపారులకూ లబ్ధి చేకూరుతుంది. జిల్లాలో 9 వేల పైచిలుకు మంది పన్ను చెల్లింపుదారులున్నారు. ఇందులో అత్యధికులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికీ ప్రాధాన్యత ఇచ్చారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షలకు పెంచారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించనున్నారు. ఎంఎస్‌ఎంఈలకు మరింత ప్రాధాన్యతతో వ్యాపారులకు మేలు జరగనుంది. అయితే ఉపాధి హామీ పనులకు గతంతో పోలిస్తే నిధులు తగ్గాయని, నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రో ఉత్పత్తుల ధరలను తగ్గించే ప్రయత్నం చేయలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

జిల్లాకు నిరాశ

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని స్మార్ట్ సిటీగా ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నా.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేదు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం విషయంలోనూ ప్రకటన లేదు. కేకేవై రోడ్డు విస్తరణ, బోధన్ –బాన్సువాడ –బీదర్ రైల్వే లైన్‌తో పాటు ఆర్వోబీల ప్రస్తావన లేకపోవడంతో జిల్లావాసులు నిరాశ చెందుతున్నారు.

అన్ని వర్గాలకు మేలు..



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేదిగా ఉంది. ఆదాయపు పన్ను పరిమితిని పెంచడంతో ఉద్యోగులతోపాటు మధ్యతరగతికి ఉపశమనం లభించింది. ఔషధాలపై కస్టమ్ డ్యూటీ తొలగించడం, కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ. 5 లక్షలకు పెంచడం వంటి చర్యలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే, కామారెడ్డి

విప్లవాత్మక నిర్ణయం



గతంలో ఉద్యోగులపై పన్ను భారం ఉండేది. ఈసారి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 12.75 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయించడంతో ఉద్యోగులకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఇది విప్లవాత్మక నిర్ణయం. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంది.

– పుల్గం రాఘవరెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు

విద్యకు కేటాయింపులు తగ్గాయి



కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యత తగ్గింది. రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది 2.53 శాతం. గతేడాదికన్నా 0.03 శాతం తక్కువ. పదేళ్లలో 3.16 శాతం నుంచి 2.53 శాతానికి నిధులు తగ్గడం గమనార్హం. విద్యకు కనీసం 6 శాతం నిధులు కేటాయించాలి.

– వేణుగోపాల్, పూర్వ అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

రాష్ట్రానికి దక్కింది శూన్యమే..



బడ్జెట్‌లో బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీల ఊసేలేదు. జిల్లాకో నవోదయ విద్యాలయం కేటాయించాలని అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. త్వరలో ఎన్నికలు జరిగే బీహార్ రాష్ట్రానికి మాత్రం వరాలు కురిపించారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి దక్కింది శూన్యమే.

– షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు

తెలంగాణకు అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. క్లిష్ట సమయంలో బీజేపీకి 8 మంది ఎంపీలను ఇచ్చిన రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం విచారకరం. కీలక రంగాలకు కేటాయింపులు తక్కువ చేశారు. బడ్జెట్‌ను బీహార్ శాసనసభ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ఉపయోగించుకున్నారు.

– కైలాస్ శ్రీనివాస్‌రావు, డీసీసీ అధ్యక్షుడు

జిల్లాకు మొండిచేయి..



కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి చూపించారు. ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులను ఓడించి బీజేపీకి పట్టం గట్టిన కామారెడ్డికి చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. జిల్లాకేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి నిధులు కేటాయించాలి. – చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఉద్యోగుల నడ్డి విరుస్తున్నారు



రూ. 12.75 లక్షల గ్రాస్ సాలరీ వరకు టాక్స్ ఉండదు. కానీ వేతనం రూపాయి పెరిగినా రూ. 60 వేల ట్యాక్స్ పడుతుంది. ఇలాంటి లెక్కలతో ఉద్యోగుల నడ్డి విరుస్తున్నారు. పెరిగిన ఆదాయానికే టాక్స్ వేయాలి. – అనిల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, టీపీటీఎఫ్

ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలి
- వీసీలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశం



కామారెడ్డి క్రైం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలను తొలగించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీలించి ఈనెల 7వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి జిల్లాలో ఎంసీఎంసీ కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు, ప్రసారాలను పరిశీలించాలన్నారు. ఈ నెల 27 న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసే సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు సరి చూసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి నుంచి అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన బాట

- జాతీయ రహదారిపై రాస్తారోకో చేయాలని నిర్ణయం
- ముందుగానే అడ్డుకున్న పోలీసులు



తిప్పాపూర్‌లో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతు

భిక్కనూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్లతో రాస్తారోకో చేయాలనుకున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. అర్హులైన రైతులందరి పంట రుణాలు మాఫీ చేయాలని, వెంటనే రైతు భరోసా అందించాలన్న డిమాండ్లతో శనివారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేయాలని మండలంలోని రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు నిర్ణయించుకున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో అప్రమత్తమై శుక్రవారం రాత్రినుంచే జాతీయ రహదారిపై పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకుంటారని ముందుగానే ఊహించిన రైతులు ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేసుకుని వేరే ప్రాంతానికి వెళ్లారు. పోలీసుల తీరుపై తిప్పాపూర్‌కు చెందిన ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరి పంట రుణాలను మాఫీ చేస్తామని, రైతు భరోసా ఇస్తామని చెప్పి మాట తప్పిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలపకుండా అడ్డుకోవడంపై అసహనం వ్యక్తం చేశాడు. అయితే రైతులు ఆందోళన చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీసుల పెట్రోలింగ్‌తో రైతులు తమ ఆందోళనను విరమించుకున్నారు. అంతంపల్లి శివారులోని నాలుగు గ్రామాలకు చెందిన పలువురు రైతులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది.

54 మంది బాల కార్మికులకు విముక్తి

కామారెడ్డి క్రైం: జిల్లాలో గతనెలలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ –11 ద్వారా 54 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని ఎస్పీ సింధు శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 48 మంది చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించామని పేర్కొన్నారు. ముగ్గురిని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించామని, మరో ముగ్గురిని చిన్నారుల సంరక్షణ కేంద్రానికి అప్పగించామని వివరించారు. పిల్లలను పనిలో పెట్టుకున్న ఆరుగురిపై కేసులు నమోదు చేయడంతో పాటు మరో 18 మంది యజమానులకు జరిమానాలు విధించామని తెలిపారు. ఎవరైనా చిన్నారులను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ప్రత్యేక బృందాలను అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- పతంజలి విశ్వవిద్యాలయం డీన్ పరమార్థదేవ్
- జిల్లాకేంద్రంలో మూడు రోజుల యోగా శిబిరం ప్రారంభం



యోగాసనాలు వేస్తూ సాధకులకు సూచనలిస్తున్న స్వామి పరమార్థదేవ్



ఎమ్మెల్యే కేవీఆర్‌తో కలిసి యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్వామి పరమార్థదేవ్

కామారెడ్డి అర్బన్: యోగా, ధ్యానం అనేవి మనిషిని శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంచుతాయని హరిద్వార్‌లోని పతంజలి విశ్వవిద్యాలయం డీన్ స్వామి పరమార్థదేవ్ పేర్కొన్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి జిల్లా శాఖల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఫ్రాబెల్స్ హైస్కూల్‌లో మూడు రోజుల మెగా యోగా శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. స్వామీజీ స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామీజీ యోగాసనాలు వేస్తూ వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడానికి యోగా, ధ్యానం చేయడం తప్ప వేరే మార్గాలు లేవన్నారు. మనిషికి వచ్చే ప్రతి అనారోగ్యానికి యోగా, ధ్యానం, ఆయుర్వేదంలో చికిత్సలు ఉన్నాయన్నారు. రోజూ కనీసం గంట సేపు ఆసనాలు, ధ్యానం చేయాలన్నారు. శిబిరంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, కార్యదర్శి శివకుమార్, జిల్లా అధ్యక్షుడు గడ్డం యోగా రాంరెడ్డి, కార్యదర్శి బి.రఘుకుమార్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు పి.అంజయ్య, యోగాచార్యులు అంజయ్యగుప్తా, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రత పెరుగుతుంది..

విద్యార్థులు రోజూ యోగా, ధ్యానం చేస్తే ఏకాగ్రత పెరుగుతుందని స్వామీజీ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్, సాందీపని, ఆర్‌కే కళాశాలల విద్యార్థులతో శిబిరంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావంతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. శ్రీసరస్వతి విద్యామందిర్ పాఠశాలల్లో సనాతన ధర్మం, భారతీయ ప్రాచీన క్రీడలు, కళలను నేర్పడం ద్వారా గొప్ప దేశసేవ చేస్తున్నారని పరమార్థదేవ్ ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీరామ జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ముప్పు..



అడవిలో వ్యాపిస్తున్న మంటలు

కామారెడ్డి క్రైం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంటుంది. కానీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇది నినాదంగానే మిగిలిపోతోంది. ఏటా వేసవికి ముందు ఆకులు రాలిపోవడం సాధారణం. ఆ సమయంలో అగ్గి రాజుకుంటే ఆడవి కాలిపోతుంది. ఈ విషయం తెలిసినా కొందరు నిర్లక్ష్యంతోనో.. కావాలనో అగ్గి పెడుతూనే ఉంటారు. దీంతో చెట్లతోపాటు వన్య ప్రాణులకూ తీరని నష్టం కలుగుతోంది. శనివారం లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో నిప్పు రాజుకుని మంటలు విస్తరించాయి. అధికారులు ఇలాంటి ఘటనలను నిరోధించి, వన సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



తాడ్వాయిలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జిల్లాలో శనివారం భక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాలలో శోభాయాత్రలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. – తాడ్వాయి

మద్యంపై పర్మళ్లవాసుల పోరుబాట

- బెల్టు షాపుల కట్టడికి చర్యలు
- నిర్వహిస్తే రూ. లక్ష జరిమానా విధించాలని తీర్మానం



తీర్మానం చేస్తున్న పర్మళ్ల గ్రామస్తులు

లింగంపేట: గ్రామంలో మద్య నిషేధం దిశగా పర్మళ్ల వాసులు అడుగులు వేస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే లక్ష రూపాయలు జరిమానా విధించాలని నిర్ణయించారు. ఈ విషయమై గ్రామస్తులు శనివారం సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మద్యం సేవించడం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. మద్యం తాగి యువకులు గొడవలు పడుతున్నారన్నారు. బొమ్మాబొరుసు, పేకాట ఆడుతూ డబ్బులు పోగొట్టుకొని క్షణికావేశంలో ఆత్మహత్యలూ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మితే లక్ష రూపాయల జరిమానా విధించాలని నిర్ణయించామన్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తుండగా పట్టిస్తే రూ.10 వేలు ఇస్తామని పేర్కొన్నారు. తీర్మాన పత్రాలను పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

బస్సు దిగుతుండగా ప్రమాదం

- నుజ్జునుజ్జయిన మహిళ కాలు
- పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎస్సై

గాంధారి(ఎల్లారెడ్డి): ఆర్టీసీ బస్సు దిగుతుండగా ప్రమాదవశాత్తు ఓ మహిళ కాలుపై నుంచి బస్సు వెనుక చక్రం వెళ్లింది. ఈ ఘటనలో మహిళ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాన్సువాడ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన సంగవ్వ పేట్ సంగెంలోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు శనివారం బాన్సువాడ నుంచి కామారెడ్డికి బస్సులో ప్రయాణించింది. గాంధారి - బాన్సువాడ రహదారిలో రాంపూర్‌గడ్డ స్టేజీ వద్ద బస్సులో నుంచి సంగవ్వ దిగిన వెంటనే బస్సు కదలడంతో వెనుక టైరు ఆమె కాలి పైనుంచి వెళ్లింది. అటుగా వెళ్తున్న ఎస్సై ఆంజనేయులు గమనించి మహిళను తన వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం సంగవ్వను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 2లక్షల 81 వేల 270 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

బీపెడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపెడ్ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 2024–25) ఒకటో, మూడో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులు ఈ నెల 6వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని కంట్రోలర్ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. రూ.100 అపరాధ రుసుముతో 7వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పది కాలాలపాటు భవనాలు ఉండాలి

- హైకోర్టు జడ్జి శ్రీనివాస్ రావు
- ఎల్లారెడ్డిలో కోర్టు భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు శ్రీనివాస్ రావు, లక్ష్మీనారాయణ అలిశెట్టి



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి శ్రీనివాస్ రావు

ఎల్లారెడ్డి: ప్రజలకు న్యాయాన్ని అందించే న్యాయస్థానాల భవనాలు పది కాలాల పాటు నిలిచేలా నాణ్యతతో నిర్మించాలని హైకోర్టు జడ్జిలు శ్రీనివాస్ రావు, అలిశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిలో రూ.25.2 కోట్లతో నిర్మించబోతున్న రెండు కోర్టు భవనాలు, రెండు న్యాయమూర్తుల నివాసగృహాల నిర్మాణ పనులకు వారు ఇరువురూ కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. నిర్మాణ పనులలో నాణ్యత లోపించడం వల్లే బాన్సువాడ కోర్టు శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లా జడ్జి వరప్రసాద్ మాట్లాడుతూ..డివిజన్ కేంద్రంగా ఉన్న ఎల్లారెడ్డిలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు కోర్టు భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు. నిజామాబాద్ అదనపు జడ్జి శ్రీనివాస్ నాయక్, కామారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, కామారెడ్డి సబ్ జడ్జి డాక్టర్ సుమలత, లీగల్ ఎయిడ్ సెక్రటరీ నాగమణి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మెజిస్ట్రేట్లు హారిక, భార్గవి, మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ దీక్షిత, కామారెడ్డి అసిస్టెంట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ రాజేందర్ రెడ్డి, ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డివిజన్ పోలీసులు హైకోర్టు న్యాయమూర్తులకు గౌరవ వందనం చేసి కవాతు నిర్వహించారు.



హైకోర్టు జడ్జికి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

న్యాయ ప్రాంగణం దేవాలయం లాంటిది

బాన్సువాడ: న్యాయ ప్రాంగణం ఓ దేవాలయం లాంటిదని, న్యాయం కోసం వచ్చే వారికి కోర్టు దేవాలయంలా దర్శనమివ్వాలని హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం బాన్సువాడలో రూ.23.65 కోట్లతో నూతన కోర్టు భవన నిర్మాణానికి మరో హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ అలిశెట్టితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడలో కోర్టు భవనం అద్భుతంగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. 2026 ఫిబ్రవరి 1 నాటికి కోర్టు భవనాన్ని పూర్తి చేయాలన్నారు. బిచ్కుందలో 1,800, బాన్సువాడలో 1,977 కేసులు ఉన్నాయని, పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. బిచ్కుంద కోర్టులో న్యాయమూర్తిని నియమించేందుకు కృషి చేస్తానని, బాన్సువాడలో సీనియర్ సివిల్ కోర్టు మంజూరు విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి వీఆర్‌ఆర్ వరప్రసాద్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, బాన్సువాడ కోర్టు జడ్జి భార్గవి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, బాన్సువాడ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, సీనియర్ న్యాయవాది భూషణ్‌రెడ్డి, న్యాయవాదులు లక్ష్మారెడ్డి, రమాకాంత్, మొగులయ్య, ఖలీల్, మోహన్‌రెడ్డి, హమీద్, రాంరెడ్డి, ఆనంద్, తదితరులున్నారు.



బాన్సువాడలో ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జిలు

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి

ఆర్మూర్‌టౌన్: వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేటీవ్ వరంగల్ ప్రాంతీయ సంచాలకులు షాహిద్‌మసూద్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి సమీక్షాసమావేశం నిర్వహించారు. వార్డు, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి విధులపై దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షాహిద్ మసూద్

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. యువత, ఉద్యోగులు, బీజేపీ వైపు ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పాత నోటిఫికేషన్లు భర్తీ చేశారని, కొత్త నియామకాలు చేపట్టలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పథకాల పేరిట ప్రజల్ని మోసం చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని, కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేస్తోందని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, బీజేపీ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, రాష్ట్ర నాయకులు నీలం రాజులు, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

పద్మశాలి సంఘం అభివృద్ధికి సహకారం

దోమకొండ: దోమకొండ మండల కేంద్రంలో మార్కండేయ జయంతి సందర్భంగా శనివారం ఘనంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మార్కండేయుడికి అభిషేకాలు చేశారు. అంతకు ముందు సీతారాముల కల్యాణం నిర్వహించి యజ్ఞం చేశారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరై ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. పద్మశాలి సంఘం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు.

తాగు నీటి ఎద్దడిని నివారించాలి



శివారురాంరెడ్డిపల్లిలో పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి



వెంకంపల్లిలో తాగునీటి సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బీబీపేట: రానున్న వేసవి దృష్ట్యా మండలంలోని యాడారం, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో తాగు నీటి సమస్యను గుర్తించడానికి ప్రత్యేకాధికారి అబ్బాగౌడ్ శనివారం గ్రామాల్లో పరిశీలించారు. తాగునీరు అందుతుందా లేదా అనే విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా వాటర్ ట్యాంకుల వద్ద పరిస్థితిని గమనించారు. కార్యదర్శి వెంకటస్వామి తదితరులున్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం రాజంపేట, శివాయిపల్లి గ్రామాలలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రఘురాం, ఏఈ శిరీష ఉన్నారు.

తాగునీటి కొరత రాకుండా చూసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ఎక్కడా కూడ తాగునీటికి కొరత రాకుండా చూసుకోవాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. తాండూర్, అక్కంపల్లి, వెంకంపల్లి గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. దీంతో పాటు గ్రామపంచాయతీలలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన రికార్డులను వారు తనిఖీ చేశారు. కార్యదర్శులు సంతోష్, కిష్టయ్య, రజిత తదితరులున్నారు.

ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కార్యదర్శులకు ఎంపీడీవో నరేష్ సూచించారు. శెట్పల్లిలో వాటర్ ట్యాంకును పరిశీలించారు.

వేసవిలో నీటి కష్టాలు రాకుండా చూస్తాం

రామారెడ్డి: తాగు నీటి కష్టాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా ఎంపీడీవో తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఇసన్నపల్లి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామాలలో తలెత్తే నీటి కష్టాలు పరిష్కరించేందుకు ప్రజల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. రామారెడ్డి జీపీ కార్యదర్శి క్రాంతి కుమార్, మిషన్ భగీరథ ఏఈ వంశీ తదితరులు పాల్గొన్నారు

బాన్సువాడ రూరల్: తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి బోర్లంలో పర్యటించారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, ట్యాంకులు, కుళాయిల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయితీ కార్యదర్శి సాయికుమార్‌కు సూచించారు.



శెట్పల్లిలో ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో



సూచనలిస్తున్న ఎంపీడీవో తిరుపతిరెడ్డి

స్టార్టప్ కంపెనీలకు చేయూత





మాట్లాడుతున్న స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు.. మలావత్ పూర్ణ

- థీమ్ డెవలప్‌మెంట్ డైలాగ్‌లో కాకతీయ సాండ్ బాక్స్ ప్రతినిధులు
- బర్ధిపూర్ శివారులో క్యాంపస్‌ను ప్రారంభిస్తామని ప్రకటన

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు రాజురెడ్డి (సియెర్రా అట్లాంటిక్), ఫణీంద్ర సామ (రెడ్ బస్ ఫౌండర్) స్థాపించిన కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో భారత్‌లో నూతనంగా ప్రారంభించే స్టార్టప్ కంపెనీల కు చేయూతనందిస్తామని సంస్థ ప్రతినిధులు అన్నారు. కాకతీయ సాండ్‌బాక్స్, దేశ్‌పాండే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో 'అన్‌లాకింగ్ స్కిల్ ఇన్ భారత్' అనే థీమ్‌తో డెవలప్‌మెంట్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ్‌పాండే ఫౌండేషన్ కో ఫౌండర్ గురురాజ్ దేశ్‌పాండే, బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.రామగోపాల్ రావు, టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా తో పాటు దేశంలోని నలుమూలల నుంచి 600 మందికి పైగా ఎన్‌జీవోలు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

కార్యక్రమంలో అతిపిన్న వయస్సులో మౌంట్ ఎవరెస్టును అధిరోహించిన మలావత్ పూర్ణ పాల్గొని పర్వతారోహణలో తన అనుభవాలను వివరించారు. బర్ధిపూర్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న కాకతీయ సాండ్‌బాక్స్ కొత్త సామాజిక క్యాంపస్ (కే హబ్)ను ఆరు నెలల్లో ప్రారంభిస్తామని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.



క్రైం కార్నర్

యాప్‌తో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ఎంజీఐ యాప్‌లో పెట్టుబడులు పెట్టించి మోసం చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. తమతో ఎంజీఐ యాప్‌లో పెట్టుబడి పెట్టించి మోసం చేశారని నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 12 మంది ఫిర్యాదు చేయగా, నార్త్ సీఐ శ్రీనివాస్ విచారణ చేపట్టారన్నారు. నగరంలోని ముజాహిద్ నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ షేక్ అమీర్ అలియాస్ ఖలీల్, బర్కత్‌పురాకు చెందిన డెలివరీ బాయ్ సయ్యద్ ఇమాన్ అలీని అదుపులోకి విచారించామన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు సంపాదించడం ఎలా అని టెలిగ్రామ్ యాప్‌లో వెతికి ఎంజీఐ యాప్‌లో పెట్టుబడులు పెట్టాలని షేక్ అమీర్ తెలుసుకున్నాడని, అతడి ద్వారా డెలివరీ బాయ్ సయ్యద్ ఇమాన్ అలీ యాప్‌లో జాయిన్ అయినట్లు తెలిపారు. ఇద్దరూ కలిసి నగరంలోని ముజాహిద్‌నగర్ హష్మీ కాలనీకి చెందిన పలువురిని చేర్పడంతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యాప్ స్కానర్ ద్వారా పలువురితో పెట్టుబడులు పెట్టించి వాటిని మళ్లీ వెనక్కి తీసుకోకుండా ఫ్రీజ్ చేశారన్నారు. ఆఫర్స్‌కు సంబంధించిన డబ్బులు తీసుకునేందుకు యాప్ నిర్వాహకులకు మళ్లీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసేవారని పేర్కొన్నారు. ఎంజీఐ యాప్ ఐపీ అడ్రస్ అమెరికాలోని కాలిఫోర్నియాలోని లాస్‌ఏంజిల్స్ నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు, భారతదేశంలో శాలివర్మ నడిపిస్తున్న నమ్మించి ప్రజలను మోసం చేశారన్నారు. యాప్‌లో ఒక్కొక్కరి ద్వారా గత ఐదు నెలలుగా రూ.100 నుంచి రూ.50వేల వరకు పెట్టుబడులు పెట్టించారని, 12 మంది రూ.2.50లక్షలు పెట్టారని వివరించారు. ఇద్దరిని అరెస్టు చేసి మొత్తంలో మోసం జరగకుండా మొదట్లోనే అడ్డుకున్నామని ఏసీపీ అన్నారు. యాప్‌లు, మల్టీ మార్కెటింగ్ పేరుతో వచ్చే వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. నిజామాబాద్ నార్త్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి



ధర్పల్లి శివారులో బోల్తా పడిన ట్రాక్టర్

ధర్పల్లి: ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దుబ్బాక గ్రామానికి చెందిన బొల్లారం సాయిలు (52) యూరియా కోసం ట్రాక్టర్‌పై వెళ్తుండగా ధర్పల్లి శివారులోని పసుపు పరిశోధన కేంద్రం సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పంట చేనులో బోల్తా పడింది. ఇంజిన్ పైన పడడంతో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి మహిళ ..

మాక్లూర్: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని తీవ్రగాయాలపాలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. గత నెల 27వ తేదీన మండలంలోని ముత్యంపల్లికి చెందిన రాజగల్ల నర్సుబాయి (69) కట్టెల పొయ్యిపై నీళ్ల వేడి చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని గాయాలయ్యాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీడియో జర్నలిస్ట్..



మహిపాల్ (ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీడియో జర్నలిస్ట్ మహిపాల్ మృతి చెందాడు. ఠాణాకలాన్ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతుడి రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి అన్న వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఇలియాస్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబానికి జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.10 వేలు, మహిపాల్ పనిచేసిన మీడియా సంస్థ యాజమాన్యం రూ.10 వేలు అందజేసింది.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి..

బోధన్‌రూరల్: మండలంలోని లంగ్డాపూర్ గ్రామ శివారులోని చెక్ డ్యాములో చేపలు పట్టేందుకు వెళ్లి గ్రామానికి చెందిన రాసుల సాయిలు (41) మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. సాయిలు ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందాడని, మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

ఎడపల్లి(బోధన్): మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన కోల దేవీసింగ్ కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసినట్లు బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు శనివారం తెలిపారు. కుటుంబ సభ్యులతో గొడవపడిన దేవీసింగ్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో దేవీసింగ్ గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడని సీఐ తెలిపారు.

చెరువులో దూకిన మహిళ

మాక్లూర్: భర్తతో గొడవపడిన భార్య చెరువులో దూకిన ఘటన మండలంలోని చిక్లీ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బోదాసు లలిత(40) భర్తతో గొడవపడింది. ఈ క్రమంలో క్షణికావేశంలో లలిత గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువుకు వెళ్లి దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చీకటిపడడంతో గాలింపు సాధ్యం కాదని, లలిత చెరువులో దూకిందా? లేక భర్తను భయపెట్టేందుకు ఎక్కడికైనా వెళ్లిందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.


రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని డిచ్‌పల్లి - ఇందల్వాయి రైల్వేస్టేషన్‌ల మధ్యల రైలుకు ఎదురెళ్లి గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 65 నుంచి 70 ఏళ్లు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడిని వివరాలు తెలిసిన వారు 87126 58591 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

గోదావరిలో దూకి ఒకరు..

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రావుల దమ్మయ్య(35) అనే వ్యక్తి గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. దమ్మయ్యకు ఇద్దరు భార్యలు రావుల పోసాని, రావుల సవిత ఉన్నారని, రెండో భార్యతోపాటు ఆమె చెల్లెలు రామవ్వ తరచూ దమ్మయ్యతో గొడవపడేవారన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దమ్మయ్య శుక్రవారం రాత్రి యంచ శివారులోని గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని చర్చి కాంప్లెక్స్‌లో ఉన్న సూపర్ మార్కెట్‌లో ఐదు రోజుల క్రితం చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విజయ సూపర్ మార్కెట్ వెనుక వైపు ఉన్న గోడకు రంధ్రం చేసి లోనికి ప్రవేశించిన దుండగులు కొంత మేర నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు లంబాడి దేవసోత్ రాజు, లంబాడి బుట్ట రాజును అదుపులోకి తీసుకుని విచారింగా నేరంగా అంగీకరించారు. ఇద్దరు కూడా మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామానికి చెందిన పాత నేరస్తులు. ఇదివరకు పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి ఇటీవలే బయటికి వచ్చారు. కామారెడ్డితోపాటు తూప్రాన్ లో కూడా ఇదే తరహాలో గోడలకు కన్నం వేసి చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక బైక్, గడ్డపార, రెండు సెల్‌ఫోన్ లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

తాటిపల్లిలో చోరీ..

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన అంకం సత్తయ్య ఇంట్లో దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఏఎస్సై బాల్‌సింగ్ శనివారం తెలిపారు. మరదలికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో సత్తయ్య శుక్రవారం తన ఇంటికి తాళం వేసి ఆమె వద్దకు వెళ్లాడు. శనివారం ఇంటికి తిరిగివచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 14 తులాలకు పైగా బంగారం కనిపించడం లేదని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.